
# పాతకుర్చీ



'చంద్రం'

తొలికోడి కూతకే మెలకువ వచ్చేసింది సీతారామయ్యకి. ప్రతిరోజూ యించు మించు యిదే వేళకి, అప్రయత్నంగానే మెలకువ వచ్చేస్తుందతనికి. ఎన్నో ఏళ్ళ నుంచీ వస్తున్న అలవాటు యిది. ఆ సమయంలో లేచి, తను చక్కబెట్టా ల్సిన రాచకార్యా లేవీ వుండవు, ముఖ్యంగా ఈ పెద్ద వయస్సులో. అయినా, అలవాటు తప్పనీయడు.

ధనుర్మాసం ప్రారంభమైయింది. చలి. బైట మంచు.

ఆ కాలం ఈ కాలం అని లేదు— ఏడాది పొడుగునా వీధి అరుగుమీదే సీతారామయ్యా పడక. వేసవి కాలం ఆరుబయట వేసుకుంటాడు మంచం. చలి ఎక్కువగా వున్నప్పుడు దుప్పటి పైన దుప్పటి కప్పుకుంటాడు తప్ప, లోపలికి మాత్రం వెళ్ళడు. లోపల

కొడుకూ, కోడలూ, నలుగురు మనవరాళ్ళూ వుంటారు. ఇల్లు చిన్నది. పైగా లోపల నాలుగు గోడల మధ్య ఊపిరి బిగబట్టినట్టుంటుంది తనకి. అలా అని నియమం పెట్టుకోలేదు గాని, భార్య పోయిన గత అయిదారు సంవత్సరాల నుంచీ యిలాగే కాలక్షేపం చేసుకొస్తున్నాడు సీతారామయ్య.

కోళ్ళన్నీ ఒక విడత కూతలు పూర్తి చేసినాయి.

కోడి కూతను బట్టి అది ఎవరి దొడ్డిలోని కోడో పోల్చుకోగలడు సీతారామయ్య. మరీ దూరమైతే అస్పష్టంగా వుంటుంది గాని, చుట్టుపక్కల కోళ్ళ కూతలన్నీ పరిచయాలే అతనికి. కూతను బట్టి దూరాన్ని అంచనా వెయ్యగలడు.

ఇవ్వాళ భిక్షాలుగారి దొడ్డిలోంచి కూత వినిపించలేదు. కారణమేమిటో?- అనుకొంటూ లేచి, దుప్పటి ముసుగు సవరించుకొని, లఘుశంక తీర్చుకు వచ్చాడు సీతారామయ్య.

భిక్షాలు వుత్త డబ్బు మనిషి. తింటానికి పిల్లలు లేకపోయినా, వున్న ఆస్తిని పెంచాలా అని తెగ తాపత్రయ పడిపోతుంటాడు. ఏపుగా పెరిగిన కోడి పుంజును డబ్బుకు కక్కుర్తిపడి అమ్మేసి వుంటాడు. ఈ సంకురాత్రి సమయంలో పందెం పుంజులకు మంచి గిరాకీ.

లఘుశంక తీర్చుకు వచ్చిన సీతారామయ్య మళ్ళీ మంచం మీదే కూర్చున్నాడు.

ఉత్తరం వైపు రామయ్యగారి దొడ్డిలోని కోడికూత ఆదేపనిగా వినిపిస్తోంది. లోకానికి మేలుకొలుపు పాడే కోడి కూతలో నిర్భీకతా, ఆత్మస్థయిర్యం వినిపిస్తాయి సీతారామయ్యకి. అందుకనే ప్రతిదినం ఆసక్తిగా వింటూంటాడు. వినీ వినీ, శక్తీ వుత్సాహం పుంజుకుంటాడు. కాని, రెండుమూడు రోజులుగా అతని కార్యక్రమానికి అంతరాయం ఏర్పడింది. కోడికూతను శ్రవణేంద్రియం సజావుగానే గ్రహిస్తున్నప్పటికీ, మనసును ఆవరించివున్న విషాద ఛాయలు అతన్ని దిగాలుగా కూర్చుండబెడుతున్నాయి.

మంచానికి దగ్గరగా, గోడకు ఆనించి వున్నాయి కూసాలు విరిగిపోయిన మడత కుర్చీ తాలూకు చెక్క ముక్కలు. కాలం రాపిడికి నునుపుదేరి, సహజ వర్ణం మారిపోయి, నల్లగా నిగనిగలాడుతూ వున్న ఆ పాతచెక్కలు, తెల్లవారుజాము మసక వెలుగులో స్పష్టంగానే కనిపిస్తున్నాయి సీతారామయ్యకి.

చెయ్యి చాపి ఒక చెక్క అందుకున్నాడు. మృదువుగా తడిమి చూశాడు. చివర విరిగిపోయి, ఎగుడుదిగుడుగా వున్న కుసి దగ్గర అతని చెయ్యి ఆగిపోయింది. చంటిపిల్లవాడికి తగిలిన దెబ్బని తడిమి చూస్తున్న కన్నతల్లిలా

ఎంతో మృదువుగా, బాధగా చాలాసేపు ఆ కుసినే నిమురుతూ వుండిపోయాడు.

మూడురోజుల క్రితం, తెల్లవారు జామున, యించుమించు యిదే వేళప్పుడు లేచి, లఘుశంక తీర్చుకు వచ్చి, అలవాటుగా మడత కుర్చీలో కూర్చున్నాడు సీతారామయ్య. ప టు క్కు న విరిగి పోయింది. తను పడిపోయాడు. తనకు తగిలిన దెబ్బను కూడా లెక్కచెయ్య కుండా కంగారుగా లేచి కుర్చీని చూసు కున్నాడు—కుసి విరిగిపోయింది.

దాదాపు ముప్పైఅయిదు సంవత్సరాల వయస్సున్న ఆ మడత కుర్చీకి లెక్క లేనన్ని మారులు మరమ్మత్తులు జరిగి నయ్. కుసులన్నీ వదులైపోతే పురి కొసలూ, నులకతాళ్లూ, నవారు బద్దెలూ కట్టి బిగించి, అలాగే కాలం గడుపు కొచ్చాడు సీతారామయ్య.

ఇప్పుడు విరిగిపోయింది!

విరిగిన కుర్చీని పదిలంగా మోసుకు వెళ్ళి చూపిస్తే, మరమ్మత్తు కుదర దన్నాడు వడ్లా బత్తుడు. ఎంతగా బతి మాలినా ఫలితం లేకపోయింది. 'అగదు అనవసరం' అనేశాడు ఖచ్చితంగా. బాధపడుతూ భద్రంగా యింటికి మోసుకొచ్చాడు సీతారామయ్య.

పడిపోయినప్పుడు తనకు తగిలిన దెబ్బ నడుమ్మీదే తగిలింది. కాని, దాన్ని అప్పుడే మర్చిపోగలిగాడు సీతారామయ్య. కుర్చీ విరిగిపోవటం మాత్రం నడుం విరిగిపోయినంత బాధపెట్టిసాగింది. దీన్ని మర్చిపోవడం సాధ్యంకావటం లేదు. కుర్చీకీ అతనికీ వున్న అనుబంధం అలాంటిది!

ముప్పై అయిదు సంవత్సరాలనాడు సీతారామయ్య భార్య కాపరాని కొచ్చింది. అదే సంవత్సరం అతనికి ఉద్యోగం వచ్చింది. ఆమె పాదం గొప్ప దన్నారు. వచ్చిన వేళావిశేషం అన్నారు అంతా ఆమె అదృష్టమే అన్నారు.

తన సంపాదనలో — మొదటి నెల జీతం అందుకొని, మొట్టమొదట సారిగా సీతారామయ్య కొన్న వుపయోగ కరమైన వస్తువు — మడత కుర్చీ.

అప్పట్లో దాని వెల ఎంతని? — ఈ తరంవాళ్ళ నమ్మకపోవచ్చు—పదకొండు రూపాయలు! మొదట్లో అను కున్నది అంతే. తయారైన తర్వాత గిట్టుబాటు కాలేదని అవోలా ముఖం పెట్టాడు వడ్లా బత్తుడు. చూడముచ్చటగా తయారైన కుర్చీని చూసి, మరో అర్ధ రూపాయి అదనంగా యివ్వటానికి వెనకాడలేదు సీతారామయ్య.

గుడ్డ వెల పద్నాలుగణాలు!

ఒక్కసారి గతం కళ్ళముందు నిలిచింది సీతారామయ్యకి.

ఆ రోజు శలవు దినం. ఉదయం పదిగంటల సమయానికి కొత్త కుర్చీ, గుడ్డా యింటికి తీసుకువచ్చాడు. అతని భార్య కుర్చీకీ గుడ్డకీ పసుపుబొట్లు



పెట్టింది. గుడ్డ ఎక్కించి, కర్రలుదూర్చి, నట్టింట్లో వేశాడు కుర్చీని. ఎత్తు పీట తెచ్చి ముందువేసింది భార్య. కొత్తగుడ్డ బిగుతుగావుండి బిరబిర లాడుతుండగా, కుర్చీలో వెనక్కి వాలి, కాళ్ళు ఎత్తు పీట మీదకు చాపుకొని, ఠీవిగా కూర్చున్నాడు సీతారామయ్య. అతని భార్య ఎత్తుపీట పక్కనే నేలమీద చతికిల పడి, తన్మయంగా అతని వంక చూసింది. తలకింద చేతులు పెట్టుకొని, అరమోడ్పు కన్నులతో భార్యను వీక్షించాడు అతను. పట్టాభిషిక్తుడైన యువరాజులా, రసానంద డోలికలలో తేలియాడుతూ, మధ్యాహ్నం భోజనం వరకూ అలాగే వుండిపోయాడతను. భార్యకూడా అక్కడే కూర్చుంది, అతని ఆనందంలో పాలు పంచుకుంది. అయిదు నిమిషాల్లో భోజనం ముగించి, మళ్ళీ వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. ఆరోజంతా యిల్లు వదల్లేదు. సాయంత్రం భోజనం

చేసిన తర్వాత కుర్చీని పెరట్లో వేసుకున్నాడు. చల్లని గాలి. పండు వెన్నెల. ఎదురుగా ఎత్తుపీటమీద భార్య. చాలా రాత్రి వరకు ఎన్నో విషయాలు ముచ్చటించుకున్నారు. ఇది జరిగి ఎన్నో ఏళ్ళయినా, నిన్నో మొన్నో జరిగినంత స్పష్టంగా గుర్తుండిపోయింది.

గతాన్ని గుర్తుచేసుకొని, దీర్ఘంగా నిశ్వసించాడు సీతారామయ్య.

వీధి మొగలో గంట, బుడబుక్కల మోత కలిసి వినిపించింది. కుక్క మొరుగుతోంది. కొద్దిసేపట్లో హరికేన్ లాంతరు వెలుగుతో, అపభ్రంశ శబ్దోచ్చారణతో, చిరుగుల గొడుగుతో, విచిత్ర వేషంలో గంటాసాయిబు ప్రత్యక్షమయ్యాడు.

ఇంటిముందు నిలబడి "బాబుగారూ!" అని పిలిచాడు గంటాసాయిబు.

"ఆఁ ఆఁ" అని వెంటనే పలికాడు సీతారామయ్య.

"శుభోజయం గలగాలి బాబుగార్కి."

ఓ పావలా తీసి ఇచ్చాడు సీతారామయ్య.

తన పద్ధతిలో దీవిస్తూ వెళ్ళిపోయాడు గంటాసాయిబు. అతనితోపాటే గంట మోతా, బుడబుక్కల శబ్దం, హరికేన్ లాంతరు మసక వెలుగూ ముందుకు వెళ్ళిపోయినయ్.

తూరుపు తెలతెలవారుతుండగా లేచి కాలవగట్టుకు వెళ్ళాడు సీతారామయ్య. తిరిగి వస్తూ తుమ్మపుల్ల విరుచుకొని, నీలాటి రేవుదగ్గర దంతధావనం ముగించాడు. పైమీది కండువాతో ముఖం తుడుచుకొంటూ, అన్యమనస్కంగా అడుగులు వేస్తున్నాడు. అప్రయత్నంగా అతని కాళ్ళు వడ్లా బత్తుడి యింటివైపు దారితీశాయి.

ఇంటిముందు చెట్టుకింద కూర్చుని పళ్ళు తోముకొంటున్న వడ్లాబత్తుడితో "వెంకటప్పయ్యా! లాభం లేదంటావా?" అని అడిగాడు సీతారామయ్య, లాభం వుండదని తెలిసీ ఆశ చంపుకోలేక.

పందుంపుల్ల పైకి తీసి, తపుక్కున పక్కన వూసి, 'యింత పిచ్చోడివేంటయ్యా!' అన్నట్టు నవ్వి, "ఊఁహుఁ" అని తల అడ్డంగా తిప్పి, "ఆ పాత కొయ్యముక్కలు పొయ్యిలోకి తప్ప మరెందుకూ పనికిరావు" అన్నాడు వెంకటప్పయ్య.

ప్రాణం చివుక్కుమంది సీతారామయ్యకి.

"మీ అబ్బాయితో చెప్పి ఒక కొత్త కుర్చీ చేయించుకోండి!" అని ఓ ఉచిత సలహా పారేసి పందుంపుల్ల బద్దలు చెయ్యటంలో నిమగ్నమైపోయాడు వెంకటప్పయ్య.

అది జరిగే పని కాదులెమ్మనుకొని, దీర్ఘంగా నిట్టూర్చి, వెనక్కి తిరిగాడు సీతారామయ్య.

చాలీచాలని జీతంరాళ్ళతో గంపెడు

సంసారాన్ని ఈదుకొస్తున్న తన కొడుకుని, వున్న పళంగా ఓ మడతకుర్చీ చేయించిపెట్టమని తను అడగ్గలడా? చూస్తూ చూస్తూ తను అడగలేడు. అడిగి భంగపడటంకన్న, ఆ ప్రయత్నం విరమించుకోవడం శ్రేయస్కరం. ఏదో నాలుగు అక్షరం ముక్కలు నేర్పించి, వాళ్ళ కాళ్ళూ వీళ్ళ కాళ్ళూ పట్టుకొని చిన్న ఉద్యోగం వేయించగలిగాడు తప్ప. ఆస్తిపాస్తులేమీ యివ్వలేక పోయాడు తను కొడుక్కి. కేవలం నెల జీతంతోనే రోజులు గడపటం ఎంతటి దుష్కరమైన విషయమో తనకు తెలియంది కాదు. పైగా, తను యింతగా బాధపడుతూన్నది కొత్త కుర్చీ కోసం కాదు. తన కుర్చీ, విరిగిపోయిన పాత కుర్చీ, ముప్పైఅయిదు సంవత్సరాలుగా తన జీవితంలో ఒక భాగమై, తన దేహానికి ఆసరా యిచ్చి, తన కష్టసుఖాలను తనతో సమానంగా భరించిన పాత కుర్చీ కోసం తను తాపత్రయపడుతున్నది.

నిజానికి ఈ కుర్చీతోటి అనుబంధం తన ఒక్కడిదే కాదు. తన భార్యకీ కొడుక్కీ కూడా ఎంతో అనుబంధంవుంది.

వీడు, అంటే తన కొడుకు, పసిపిల్లాడుగా వున్నప్పుడు, తను మడత కుర్చీలో పడుకుంటే, తన పొట్టమీద కూర్చొని ఆటలాడుకొనేవాడు కాదూ! కుర్చీలో కూర్చోబెట్టి ముందుకీ వెనక్కీ వూపుతోంటే పిడికిళ్ళు బిగించి వుయ్యాల వూగుతున్నట్టు హుషారుగా కేరింతాలు కొట్టేవాడు.

శలవు దినాలలో, భార్య వంటచేస్తున్నంతసేపూ, వంటగది గుమ్మానికి ఆన్చి, మధ్యగదిలో కుర్చీ వేసుకునేవాడు తను. ఒకటే కబుర్లు. కాలం ఎలా గడిచేదో తెలిసేది కాదు.

సాయంత్రం యిల్లు జేరి, అయిదు నిమిషాలు కుర్చీమీద నడుం వాలిస్తే చాలు, రోజంతా పడిన శ్రమ తాలూకు అలసట యావత్తూ చేత్తో తీసిపారేసినట్టు యిట్టే మాయమైపోయేది.

ఊళ్ళో లేని కాలం మినహాయిస్తే, ఈ ముప్పైఅయిదు సంవత్సరాలలోనూ, తను కుర్చీని వుపయోగించని రోజు లేదంటే అతిశయోక్తి కాదు. రోజుకి ఒక్కసారైనా కుర్చీలో కూర్చోందే తన కెలా గడుస్తుంది!

తన కుర్చీని యితరులకి 'ఆఫర్' చెయ్యటమనేది తనకు సుతరామూ నచ్చని విషయం. కాని, అప్పుడప్పుడు తప్పనిసరి అయ్యేది. ఎంతో బాధకలిగేది.

'నాకన్న ఈ కుర్చీతోనే మీరు ఎక్కువగా సాహచర్యం చేస్తున్నారు!' అని భార్య చమత్కరిస్తే నవ్వుకొనేవాడు.

అలాంటి కుర్చీ ఈనాడు తనకు వుపయోగపడకుండా పోతోంది. శాశ్వతమైన ఈ వియోగం ఊహించటానికే కష్టంగా వుంది. భార్యా వియోగంకన్నా గొప్పదా యిది?— అంటే సమాధానం చెప్పలేడు.

భార్య పోయినప్పుడు తనేమను కున్నాడు? ఇంక బ్రతకటం వ్యర్థం అనుకున్నాడు. అసలు బ్రతకగలనా?— అని సందేహపడ్డాడు. కాలక్రమేణా స్మృతులు మరుగున పడిపోలేదా? స్మృతులంటే గుర్తొస్తోంది— ఆవిడకి సంబంధించిన తన అనుభవాలను, మధుర స్మృతులను గంటలూ రోజులూ తరబడి ఈ కుర్చీలోనే కూర్చొని నెమరువేసుకొనేవాడు. భార్య పోయిన తర్వాత కొంతకాలం యిదే తన కాలక్షేపం.

బాధల భారంతో బరువెక్కిపోయినప్పుడూ, ఆనందపారవశ్యంతో తేలిపోయినప్పుడూ ఒకేలాఆదరించేది ఈకుర్చీ.

మనుషులకు చిన్నచిన్న జబ్బులు చేస్తే వైద్యం చేయించి, నయమైతే సంతోషిస్తారు. తన కుర్చీకి చిన్నచిన్న మరమ్మత్తుల అవసరం వచ్చినప్పుడు తన 'ఫీలింగ్' అలాగే వుండేది. వైద్యానికి లొంగని పెద్దజబ్బుచేసి, ప్రాణంపోతే అంతకు ముందున్న అనుబంధాలన్నీ పక్కనపెట్టి, కాటికి సాగనంపుతారు.

తనేం చేశాడు భార్యని?

ప్రాణాలు పోవటానికి జబ్బే రానక్కర్లేదు. వార్ధక్యం కూడా జీవితానికి చరమగీతం పాడేస్తుంది. రేపు తన గతీ అంతే. ఈనాడు తన కుర్చీ వార్ధక్యంవల్లే నిరుపయోగమైపోయింది. నిరుపయోగమైనప్పుడు వస్తువులతోపాటు మనుషులూ నిర్లక్ష్యం చెయ్యబడతారు.

ఇంటికి వెళ్ళటం యిష్టంలేదు సీతారామయ్యకి. వెళ్తే కూర్చోవటానికి కుర్చీ లేదు మరి! అరుగుమీదో మంచంమీదో కూర్చోవాలి.

బయట తిరగాలన్నా నిరుత్సాహంగా, నిస్సత్తువగా వుంది. పైగా ముఖం కడుక్కున్న వెంటనే గొంతులో కాఫీ నీళ్ళు పోసుకొనే అలవాటొకటి!

తిన్నగా యింటికే నడిచాడు సీతారామయ్య.

అరుగుమీద కుర్చీ చెక్కలు కనిపించ లేదు.

'ఏమైనయబ్బా!' అనుకొంటూ కోడల్ని పిలిచాడు.

ఆమె వంటగదిలోంచి పలికింది.

లోపలికి వెళ్ళి "అరుగుమీద పెట్టిన కుర్చీచెక్కలేమైనయమ్మా?" అనడిగాడు.

కాఫీ డికాషన్ వడకడ్తున్న ఆయన కోడలు తాపీగా చెప్పింది— "అవ్వింక పనికిరావని వడ్లబత్తుడు చెప్పాడన్నారు. నిన్న మీరు. కట్టెపేళ్ళు పచ్చిగా వుండి అంటుకోకపోతే వాటిల్ని పొయ్యిలో పెట్టాను."

నిశ్చేష్టుడైపోయాడు సీతారామయ్య.

కొన్ని చెక్కలు పొయ్యిలో కణకణ మండుతున్నాయి. కొన్ని పొయ్యి పక్కనే వాటి వంతుకోసం కాచుకొని వున్నాయి.

దాదాపు ముప్పైఏళ్ళు తనతో సాహచర్యం చేసిన భార్య, అయిదేళ్ళనాడు శ్మశానంలో కాష్ఠంమధ్య కాలుతూ వుంటే యిలానే నిలబడి చూశాడు. కన్నీళ్ళు పొరలు కట్టినయ్.

ఇప్పుడూ అదే జరిగింది.

—